క్లుప్తంగా

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు జీరో టికెట్ ఇస్తున్న కండక్టర్

ఆదిలాబాద్: మహాలక్ష్మి పథకాన్ని ప్రతీ మహిళా సద్వినియోగం చేసుకోవాలని డీఎం కల్పన అన్నారు. శుక్రవారం మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ ఇష్యూ చేశారు. బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఎం మాట్లాడుతూ.. తెలంగాణలో నివసించే ప్రతీ మహిళకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. మహిళలు ఎవరైనా ప్రభుత్వ ఆమోదిత గుర్తింపు కార్డు కండక్టర్లకు చూయించి, ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లక్ష్మి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్‌స్టేషన్‌లో వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున అన్ని వసతులతో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సర్వేయర్ మనోజ్ రికార్డ్ అసిస్టెంట్ అడెల్లు, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు'



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్సై సునీల్ అన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు అయిన వారికి శుక్రవారం అవగాహన కల్పించి ఉట్నూర్ కోర్టుకు హాజరుపరిచారు. తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అఫ్జర్, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలి

గుడిహత్నూర్: మండలంలోని రేషన్ డీలర్లు ఈ-కేవైసీని వందశాతం పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్ల పరిధిలోని రేషను కార్డులోని ప్రతి సభ్యుడిని అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈక్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన క్రీడాకారులు

ఆదిలాబాద్: కామారెడ్డిలో నిర్వహించనున్న అండర్-14 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదిలాబాద్ క్రీడాకారులు కోచ్ గోవింద్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈనెల 16 నుంచి 17 వరకు రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా క్రీడాకారులు ఎంతగానో శ్రమిస్తున్నారని, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్ కరాడ్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. కాగా.. శుక్రవారం కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేశ్ జాదవ్ ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా శాంతాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి సాబ్లే రాయమల్ అన్న సాబ్లే దశరథ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

క్యాంపు కార్యాలయానికి కొత్త రంగులు

బోథ్: బోథ్ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్ గెలుపొందడంతో నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రంగులు వేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రానున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా అనిల్ జాదవ్‌ను అధికారులు, నాయకులు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్నేహితులకు అండగా..

- అపూర్వ సమ్మేళనం పేరిట కలుసుకుంటున్న పూర్వ విద్యార్థులు
- ఆపదలో ఉన్న మిత్రులకు చేయూత



తాంసిలో 1983- 84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం (ఫైల్)



1997-98 బ్యాచ్‌కు చెందిన స్నేహితుడు అశోక్ కిరాణాషాప్‌కు రూ.50వేలు అందజేస్తున్న స్నేహితులు

తాంసి: వారంతా చిన్నప్పటి నుంచి ఒకచోట కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. చదువు పూర్తయిన తరువాత వివిధ ప్రాంతాల్లో కుటుంబాలతో స్థిరపడ్డారు. చిన్ననాటి మిత్రులను కలుసుకోవాలని వారి కష్టాసుఖాలు పంచుకోవాలని అప్పుడప్పుడు ఒక్కచోట చేరి కలుసుకుంటున్నారు. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ఆపదలో స్నేహితులకు అండగా ఉంటున్నారు. మిత్రులంతా కలిసి తలకొంత డబ్బులు పోగుచేసి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా.. మరికొందరు ప్రైవేట్ రంగాల్లో స్థిరపడ్డారు. పూర్వ విద్యార్థులు ప్రతీఏటా విద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకుంటున్నారు.

అపూర్వ సమ్మేళనంతో ఒకచోటుకి..

వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడిన చిన్ననాటి స్నేహితులు తమ జ్ఞాపకాలను పంచుకోవాలనే ఆలోచనాలతో అపూర్వ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. పాఠాలు బోధించి ఉన్నతంగా తీర్చిన ఉపాధ్యాయులను గౌరవంగా ఆహ్వానించి సన్మానిస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్నేహితులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలకు సైతం తాము ఉన్నామంటూ భరోసా కల్పిస్తున్నారు.

సాయం చేస్తున్నారు ఇలా..

- తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు తమ మిత్రుడికి అండగా నిలిచారు. రాంపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడైన రాగం అశోక్‌కి రూ.50 వేల ద్వారా కిరాణాషాప్‌కి అవసరమైన వస్తువులు కొనిచ్చారు.
- 1999– 2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ స్నేహితుడు ఆరోగ్యం బాగాలేక మృతి చెందితే కుటుంబానికి అండగా నిలిచారు. వారి కుటుంబానికి రూ.75వేలు పోగు చేసి ఆశన్న పిల్లల పేరుపై బ్యాంక్‌లో డిపాజిట్ చేసి పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు.
- 2002– 03 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో ఉన్న స్నేహితుడికి వైద్యసాయం అందించారు. కైలాస్ అనే స్నేహితుడికి రూ.25 వేలు అందజేసి వైద్యం అందించి అండగా నిలిచారు.
- 1983–84 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం ద్వారా పాఠశాలలో కలుసుకున్నారు. ప్రతీఏటా కలుసుకొని పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇలా పాఠశాలలో చదివిన పలువురు పూర్వ విద్యార్థులు తమ స్నేహితులకు అండగా నిలుస్తున్నారు.

విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్ మూడు మండలాలకు కలిపి విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీహెచ్‌పీ ఇందూర్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ, సహ కార్యదర్శి సంతోష్‌ల ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. ప్రఖండ అధ్యక్షుడిగా పిల్లి నరేశ్ (ఇచ్చోడ), ఉపాధ్యక్షుడిగా చెన్నాల మహేందర్(ఇచ్చోడ), ఎగ్గిడి ఇస్తారి (సిరికొండ), కార్యదర్శిగా గెడం నగేందర్ (ఇచ్చోడ), సహాయ కార్యదర్శిగా జాక్తాబ్ సిద్దేశ్వర్ (ఇచ్చోడ), మధుకర్ (సిరికొండ), కోశాధికారిగా గట్ల రామగిరి సుధాకర్ (ఇచ్చోడ), భజరంగ్ దళ్ సంయోజక్‌గా అక్కినెపెల్లి రాజు (ఇచ్చోడ), సహా సంయోజక్‌గా పాల్వే శివాజీ (బజార్‌హత్నూర్), ధర్మప్రసార్‌గా సుధాకర్ (ఇచ్చోడ)లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తరుణ్‌చుగ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం పట్ల అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాజాసింగ్, రామారావు పాటిల్, పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, ఇందుకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాల పెంపునకు ఒకటి నుంచి ఐదోతరగతి వారికి తొలిమెట్టు, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వారికి ఉన్నతి, పదో తరగతి వారికి లక్ష్య అనే ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల విజయవంతానికి ఈనెల 12 నుంచి జనవరి 12 వరకు 'అకాడమిక్ బబుల్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తే విద్యార్థుల్లో చదవడం, రాయడం తదితర ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా స్కూల్ వివరాలు తెలుసుకుని తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్లు, డీఈవోలకు సూచించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు తొలిమెట్టు, లక్ష్య, ఉన్నతి కార్యక్రమాల ద్వారా పిల్లలకు అత్యుత్తమమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు బెడ్‌షీట్లు కరువు



నార్నూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా.. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం వసతులు కల్పించడం లేదు. దీంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచే బెడ్‌షీట్లు (దుప్పట్లు) తీసుకోని వస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ఆసుపత్రిలో వసతులు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

పూర్వ ప్రిన్సిపాల్ మృతికి సంతాపం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ టి.కిష్టయ్య మృతిపట్ల కళాశాల లెక్చరర్లు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. శుక్రవారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, లెక్చరర్లు రఘునాథ్, సంతోష్ కుమార్, విజయ్ కుమార్, నర్సింగరావు, దయాకర్, సాయిప్రసాద్, అనిత, జ్యోత్స్న, అష్రఫ్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసక్టమి చికిత్సకు ముందుకు రావాలి

ఇచ్చోడ: వ్యాసక్టమి శస్త్ర చికిత్సకు పురుషులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో వ్యాసక్టమిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాసక్టమి శస్త్ర చికిత్స అనేది చాలా సాధారణమన్నారు. కేవలం ఐదు నిమిషాల్లోనే శస్త్ర చికిత్స పూర్తవుతుందన్నారు. మహిళలతో సమానంగా పురుషులు కూడా వ్యాసక్టమి శస్త్ర చికిత్స చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిచి ఉంటుందన్నారు. పాత హౌజింగ్ బోర్డు, కుమ్మరివాడ, వాల్మీక్‌నగర్, ఇండస్ట్రీయల్ ప్రాంతం, ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో రాణిసతీజి కాలనీ, అశోక్‌రోడ్, కోలిపుర, బొక్కల్‌గూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాంపూర్, పొచ్చర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల చేపడుతున్నందున గుడిహత్నూర్, తోషం, కొల్హారీ, మచ్చాపూర్, ముత్నూర్, శాంతాపూర్, మన్నూర్, గురుజ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెన్షనర్స్ డే విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కంది లక్ష్మారెడ్డి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ హోమ్‌లో ఈనెల 17న నిర్వహించే పెన్షనర్స్ డేను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంది లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ముందుగా నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలోని రిటైర్డ్ ఎంప్లాయీలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఇందులో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీడీఎస్‌ల సమ్మె



సమ్మె చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ఎదుట తమ డిమాండ్లను పరిష్కరించాలని జీడీఎస్ ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం సైతం కొనసాగింది. నిరసనలో భాగంగా జీడీఎస్‌లు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. కేంద్రం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీడీఎస్ నాయకులు జాదవ్ కిరణ్, రమేశ్ తదితరులున్నారు.


ఇచ్చోడ: కేంద్రం ప్రభుత్వం తపాల సమస్యలు పరిష్కరించాలని జీడీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. 8 గంటల పనితో పాటు పెన్షన్ విధానం వర్తింప జేయాలన్నారు. ఉద్యోగులకు 12 నుంచి 36 సంవత్సరాల సర్వీసుల అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ. 5 లక్షలకు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు. నాయకులు శేక్ కమొరొద్దిన్, పోశాలు, రాజు, అపర్ణ, భూదేవి, నాందేవ్, జహుర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చలి తీవ్రత ఉన్నందున వెచ్చని దుస్తులు ధరించాలన్నారు. వేడి వేడి భోజనం తినాలని సూచించారు. 46 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలన్నారు.

ఇంటర్ విద్యార్థులు చదువుకు దూరం

- మండల కేంద్రంలో లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ముఖ్యమంత్రి ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు



సిరికొండ మండల కేంద్రం



ఈ చిత్రంలో కనిపిస్తున్న గిరిజన విద్యార్థి పేరు సిడాం భీంరావు. మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన వాడు. గతేడాది పదో తరగతి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించాడు. కానీ ఇంటర్ ఇతర మండలానికి వెళ్లి చదువుకునే స్తోమత లేక చదువు మానేశాడు. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు.

సిరికొండ: రాష్ట్రంలో ఏ మండలంలో జూనియర్ కళాశాలు లేకున్న వాటి వివరాలు తెలియజేయాలని విద్యాశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో జూనియర్ కళాశాల లేక పైచదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక మధ్యలోనే చదువు ఆపేస్తున్న విద్యార్థుల ఆశలు చిగురించాయి.

బుగ్గి పాలవుతున్న విద్యార్థుల జీవితం..

గిరిజన ప్రాంతం జీవన స్థితిగతులు అంతంత మాత్రంగా ఉండి జీవిస్తున్నారు. తము మాత్రం చదువుకోలేదని మా పిల్లలకు ఆపరిస్థితి రావొద్దని గిరిజన గ్రామాల్లో విద్య వైద్యం సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం గిరిజనులకు అన్ని వసతులు కల్పిస్తున్నా.. విద్య విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. సిరికొండ నూతన మండలంలో విద్య వ్యవస్థ గడిన పడకపోవడంతో తమ పిల్లల బతుకులు బుగ్గిపాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల లేక చదువుకోలేక..

2016లో ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాల నుంచి వేరు చేసి సిరికొండ మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలం ఏర్పాటు చేసి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా.. ఇప్పటి వరకు గిరిజనుల చదువుల కోసం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయలేదు. దీంతో మండలంలోని విద్యార్థులు పదో తరగతి వరకే చదువుకుంటున్నారు. ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాలకు వెళ్లి ఇంటర చదువుకోలేక వ్యవసాయంలో తల్లిదండ్రులకు చోదోడు వాదోడుగా నిలుస్తున్నారు. మండల కేంద్రంలో ఇంటర్ కళాశాల ఉంటే తము కూడా అందరిలాగే చదువుకునే వాళ్లమని విద్యార్థులు చెబుతున్నారు.

ఇచ్చోడకు వెళ్లలేక..



ప్రతీరోజు రిమ్మ గ్రామం నుంచి ఇచ్చోడ 25 కిలోమీటర్లు ప్రయాణించి చదువుకోలేకపోతున్న. ఇచ్చోడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుతున్న కానీ రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లే స్తోమతు లేదు. సిరికొండలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలి.

– కినకరావు, ఇంటర్ విద్యార్థి, రిమ్మ గ్రామం

కూలీ పనికి వెళ్తున్న



నేను ఇంటర్ రెండో సంవత్సరం ఇచ్చోడ మండల కేంద్రంలో చదువుతున్నాను. ప్రతీ రోజు ఇచ్చోడకు వెళ్లి చదువుకోవాలి. సిరికొండ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో వెళ్లాలి. ప్రతీ రోజు సుమారుగా రూ. 60లు ఖర్చు అవుతుంది. దీంతో రెగ్యులర్ కాలేజీకి వెళ్లకుండా కూలీ పనులకు వెళ్తున్న.

– సూర శేఖర్ ,ఇంటర్ విద్యార్థి, సిరికొండ

అవగాహన సదస్సు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంతేకాబ్ ఆలం

ఎదులాపురం: హ్యూమన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సెంటర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించే అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి ఇంతేకాబ్ ఆలం కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెరియర్ గైడెన్స్‌తో పాటు విద్యా సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఢిల్లీ నుంచి ప్రముఖ వ్యాఖ్యాత సమీర్ సిద్దికి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అజ్జు ఫారూఖీ, తదితరులు పాల్గొన్నారు.